క్లుప్తంగా

నేటి నుంచి శ్రీ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి బాబా 98వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం నుంచి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీ సత్యసాయి సేవా సమితి శనివారం ప్రకటన విడుదల చేసింది. ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో ఈ నెల 23వ తేదీ వరకు ఈ వేడుకలు కొనసాగనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఆదివారం శ్రీసత్యసాయి మహిళ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీంతో పాటు సాయంత్రం వేదం, అష్టోత్తరం, నామసంకీర్తన కార్యక్రమాలు జరగనున్నాయి.

శ్రీవారి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు



పుష్పయాగానికి తరలిస్తున్న పువ్వులకు సంకల్పం చేస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: శ్రీ వేంకటేశ్వరస్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పువ్వులు తరలివెళ్లాయి. శనివారం విశాఖలోని శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధులు ఈ పువ్వులకు సంకల్పం చేశారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న హెచ్‌డీపీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేల సంఖ్యలో కలువ, తామర, లిల్లీ, చామంతి పూవ్వులకు సంకల్పం చేసి తిరుపతి పంపించారు. పుష్పయాగం అనంతరం వీటిని విశాఖ తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో పేదలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పి.ఐ బాలరాజు పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాబిరెడ్డి, అక్కరమాని వెంకటరావు, సత్తి మందారెడ్డి, గూడపాటి విక్టర్, వానపల్లి ఈశ్వరరావు, వెంకట్, శ్రీదేవి, శిరీషా పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

బీచ్‌రోడ్డు: శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా బీచ్‌రోడ్డులో ఉన్న కాళీమాత ఆలయం వద్ద నిరుపేదలకు దుప్పట్లు ఆహార పదార్థాలు శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఈ సేవలను మరింతగా విస్తరిస్తున్నామని శక్తి అధ్యక్షురాలు పైడి రజని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, సంగీత, మాధురి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ జ్ఞాన లింగేశ్వర ఆలయంలో అయ్యప్ప భక్తుల నిత్య అన్నదానం కార్యక్రమాన్ని ప్రముఖ వ్యాపారవేత దామోదరరావు దంపతులు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు.



జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సభా ప్రాంగణం వద్ద భారీగా జనం

తూర్పులో జైత్ర 'యాత్ర'

- సామాజిక సాధికార బస్సుయాత్ర సభకు తరలివచ్చిన జనం
- ఆరిలోవ నుంచి ఎంవీపీ కాలనీ వరకు భారీ ర్యాలీ
- కిక్కిరిసిన ఎంవీపీ కాలనీ కూడళ్లు, సభాప్రాంగణం

వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర జైత్రయాత్రలాకొనసాగుతోంది. విశాఖ తూర్పులో శనివారం దిగ్విజయంగా సాగింది. ఏఎస్‌రాజా మైదానంలో బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. అడుగడుగునా సామాజిక సాధికారత ప్రతిధ్వనించింది. తూర్పు నియోజకవర్గంలో పార్టీ జెండా రెపరెపలాడింది.

ఎంవీపీకాలనీ: ఆరిలోవ చివరి బస్‌స్టాప్ నుంచి ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం వరకు బస్సుయాత్ర సాగింది. దీంతో పాటు పార్టీ శ్రేణులు భారీ వాహన ర్యాలీ నిర్వహించాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ర్యాలీ వెంకోజీపాలెం కూడలి, ఇసుకతోట, టీటీడీ కూడలి మీదుగా ఏఎస్ రాజా మైదానానికి చేరుకుంది. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొని ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం ద్వారా కలిగే లబ్ధిని చాటిచెప్పారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. సభకు నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. దీంతో సభ ప్రాంగణమంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ, విశాఖ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణల నామస్మరణతో మార్మోగింది. పార్టీ తూర్పు నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణంలో వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసినివాళులర్పిస్తున్న పార్టీ నేతలు



బస్సు యాత్ర సభకు తరలివచ్చిన ప్రజలు, పార్టీ నేతలు



సభాప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలతో ఉర్రూతలూగించిన కళాకారులు

గ్రామీణ హస్తకళలను ప్రోత్సహించడమే లక్ష్యం

నాబార్డు ఏపీ డీజీఎం కేవీఎస్ ప్రసాద్

మద్దిలపాలెం : గ్రామీణ హస్తకళాకారుల తయారు చేసిన ఉత్పత్తులను పట్టణాలు, నగరాల్లో విక్రయించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నాబార్డు ఆంధ్రప్రదేశ్ జీఎం కె.వి.ఎస్.ప్రసాద్ అన్నారు. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నాబార్డు ఆర్థిక సహాయంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఇన్ మాల్ పేరిట ఏర్పాటు చేశారు. దీన్ని ఆయన శనివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళ ప్రియులకు సరసమైన ధరలకు హస్తకళలను విక్రయించడానికి మాల్ ఇన్ స్టాల్ దోహదపడుతుందన్నారు. అదే సమయంలో హస్తకళాకారులు జీవనానికి మద్దతు ఇచ్చినట్టు ఉంటుందన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకూ హస్తకళాకారులు ఉత్పత్తులు విక్రయాలు జరుగుతాయన్నారు. హస్తకళాకారుల స్టాల్ ఏర్పాటు చేయడంతోపాటు ఉచిత వసతి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అనంతరం డీజీఎంలు దివి ఎస్ పింకర్, సీఆర్ అబురాజన్, సమంత్‌కుమార్, జాన్సీ కసరాల మాట్లాడుతూ నాణ్యమైన హస్తకళా ఖండాలను ఈ మాల్ ఇన్‌స్టాల్‌లో లభిస్తాయన్నారు. నేస్తం సంస్థ ప్రతినిధి సురేష్ మాట్లాడుతూ గ్రామీణ హస్తకళాకారులు ఆర్థిక ప్రగతి, వారికి చేయుతని చ్చేందుకు నాబార్డు ముందుకురావడం ఆనందకరమన్నారు.



సీఎంఆర్ సెంట్రల్ గ్రామీణ హస్తకళ స్టాల్ ప్రారంభిస్తున్న నాబార్డు ఏపీ ప్రసాద్

విస్తృతంగా స్వచ్ఛక్యాంపస్



స్వచ్ఛక్యాంపస్ కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శనివారం స్వచ్ఛక్యాంపస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రతీ విభాగంలో గంట సమయం ఆచార్యులు, విద్యార్థులు, ఉద్యోగులు భాగస్వాములవుతూ వ్యర్థాలను తొలగించారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో ఏయూలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జియో ఇంజినీరింగ్ విభాగం వద్ద నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, శానిటేషన్ డీన్ ఆచార్య జి.వీ రాజు, జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం నృత్యరూపకం



భగీరథ విలాసం నృత్యరూపకంలో గీతానారాయణ్

మద్దిలపాలెం : ఆకాశ గంగను ధరిణిలోకి రప్పించడంలో భగీరథుడు ప్రయత్నం ఎలా ఫలించిందనే అపురూప నాట్య రూపాకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కళా సరిత్సాంగరంస గ్రంథ కర్త అయిల సోమయాజులు జోగారావు కలం నుంచి జాలువారిన భగీరథ విలాసం నృత్యనాటకానికి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి 23వ వార్షికోత్సవం సందర్భంగా ప్రదర్శించారు. వీఎండీఏ వార్షికోత్సవ సంబరాలను ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్ నారాయణ్ ప్రారంభించారు. కూచిపూడి డ్యాన్స్ గురువు కేవీ లక్ష్మి నిర్దేశకత్వంలో జరిగిన ఈ వేడుకల్లో తొలి ప్రదర్శనగా ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారిణి సూదాగాని గీతానారాయణ్ శివరంజని రాగంలో మహేశ్వరి మహాకాళి నృత్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా కేవీ లక్ష్మి మాట్లాడుతూ వీఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్ గౌడ్ పాత్ర అనితర సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కోల్‌కతా ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.సత్యనారాయణ, ఆదాయ పన్నుల శాఖ (అప్పీల్స్) మనోజ్‌కుమార్, రమణమూర్తిలు పాల్గొన్నారు.

క్లీన్ విశాఖ లక్ష్యం



మొబైల్ టాయిలెట్లు ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: క్లీన్ ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి ముడసర్లోవ ఎం.ఎస్.ఎఫ్‌లో పారిశుధ్య యంత్రాలను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఆమె ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 310.87 లక్షలు ఖర్చుచేసి బ్యాక్ హో లోడర్లు, మినీ ఎక్స్‌కవేటర్లు, మొబైల్ టాయిలెట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా నగరం మరింత పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. విశాఖను చెత్త, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిద్దిడానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్‌మెంట్ శాఖ, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 కోట్లు వ్యయం చేసి వాహనాలు, పరికరాలు, బిన్లు, కొనుగోలు చేయడానికి పరిపాలనా ఆమోదం పొందిందన్నారు. దీంతో ప్రస్తుతం జీవీఎంసీకి అవసరమైన 4 బాక్ హో లోడర్లు, 9 మినీ ఎక్స్‌కవేటర్లు, 4 మొబైల్ టాయిలెట్లు కొనుగోలు చేశామన్నారు. వీటిని అవసరాన్ని బట్టి పలు జోన్లకు సర్దుబాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీరు కృష్ణారావు, జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మి, పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ లోను సకాలంలో మంజూరు చేయాలి

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంతమంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన డబ్బులు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణపై అవగాహన



టీ షర్టులు ఆవిష్కరిస్తున్న తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్-2 విజేత సౌజన్య, వైద్యులు

ఆరిలోవ: బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్-2 విజేత సౌజన్య భాగవతులు పాల్గొన్నారు. కంటి సమస్యలు ఉన్న పిల్లలతో కలిసి కొంతసేపు ఆమె సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్.కె బీచ్ వద్ద బీచ్‌రోడ్డు ఖాళీ మాత విగ్రహం వద్ద నిర్వహించనున్న అవగాహన వాక్‌థాన్‌కు సంబంధించిన టీషర్టులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు డాక్టర్ స్నేహల్ గణత్ర మాట్లాడుతూ పిల్లల కంటి సమ్యపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పిల్లలు ప్రదర్శించిన 'నేత్ర సంరక్షణకు మంచి అలవాట్లు' నాటిక అలరించింది. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు శోభారాణి, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూక్స్ కోర్సులతో బహుళ ప్రయోజనం



ఇందిరను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: విద్యార్థుల అభ్యున్నతికి మూక్స్ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని ఐబీఎస్ ఇండియా ఇ లెర్నింగ్ విభాగం డీన్ డాక్టర్ ఇందిర కోనేరు అన్నారు. శనివారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఓఇఆర్ అండ్ మూక్స్ ఫర్ లైఫ్ లాంగ్ లెర్నింగ్' అంశంపై ప్రసంగించారు. ఓఇఆర్, మూక్స్ వలన ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ ఇందిరను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



అవగాహన కల్పిస్తున్న మలేరియా సూపర్‌వైజర్ రత్నం

మద్దిలపాలెం: దోమల వ్యాప్తిని అరికట్టాలంటే ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వారం నిర్వహించే ఫ్రైడే డ్రైడేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్‌యూనిట్ సూపర్‌వైజగర్ వై.ఎస్. రత్నం అన్నారు. దోమల వ్యాప్తికి కారకమైన నీటి నిల్వల తొలగింపు ప్రక్రియ ప్రతి శుక్రవారం జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను అందరూ సహకరించి, భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కె.ఎస్.ఎన్.రెడ్డి, శేషుబాబు పాల్గొన్నారు.

నాక్ ర్యాకింగ్‌పై వీసీకి అభినందనలు



వీసీ ప్రసాద రెడ్డిని అభినందిస్తున్న వేమనసంఘం సభ్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో అత్యుత్తమ నాక్ ర్యాకింగ్ సాధించడం పట్ల వేమన, రెడ్డి అసోసియేషన్ సభ్యులు శనివారం వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు సత్తి నాగేశ్వర రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోర కుమార్ రెడ్డి, కోర్ కమిటి సభ్యులు దల్లి రామకృష్ణా రెడ్డి, బి.శ్యామ్ కుమార్ రెడ్డి, డి.వి.ఎస్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు ఎస్.కె.ఇ అప్పారావు వీసీ ప్రసాద రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న వైద్యులు

మద్దిలపాలెం : పాఠశాల విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మద్దిలపాలెంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి బ్రాంచ్‌లో శనివారం కంటి ఆరోగ్య కళా పోటీలు నిర్వహించారు. పోటీలలో భాగంగా కంటి అద్దాల డమ్మీ ఫ్రేమ్‌లపై విద్యార్థులు వివిధ బొమ్మలు గీశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు డాక్టర్ రేష్మి రథ్, డాక్టర్. ఉషా మోహన్, డాక్టర్ నళిని, ఉషా ఆత్మకూరి పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

సిస్టర్ ఆలిస్ మేరీ అస్తమయం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆలిస్ మేరీ(86) శనివారం తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 60 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ నుంచి భారతదేశం వచ్చిన ఆమె, విశాఖ సెయింట్ జోసెఫ్ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా చేరారు. అనంతరం ప్రధానాచార్యులుగా, కరస్పాండెంట్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా సేవలందించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ చర్చ్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని సిస్టర్ షైజీ తెలిపారు.